www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 నవంబర్ 2025
5
చిత్తూరు



విద్యుత్ సంస్థను కాపాడుకుందాం

ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం.. రాష్ట్ర సదస్సులో జయశంకర్



ప్రజాశక్తి- తిరుపతి సిటి

కార్పోరేట్ శక్తులకు ప్రజాసొమ్మును అప్పనంగా దోచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకొని, సంస్థను కాపాడుకుందామని ఈఈ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జయశంకర్ పిలుపునిచ్చారు. విద్యుత్తురంగ ప్రైవేటీకరణ ఆపాలి, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి అనే నినాదంతో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును మంగళవారం తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సదస్సుకు యుఈఈయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సంక్షోమంలో కూరుకుపోయాయని, అమెరికా వంటి సంపన్న దేశం కూడా ఆర్థికంగా అంతమైందని, అలాంటి సమయంలో కూడా మన దేశం ఆర్థికంగా బలంగా నిలబడడానికి ప్రధాన కారణం బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తం ప్రభుత్వ ఆధీనంలో ఉండడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు దారులు తెరవడంతో దోపిడీదారులు ప్రవేశించి ప్రభుత్వ సంస్థలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశలవారీగా ప్రైవేటీకరణలో భాగంగా స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని, సబ్ సెంటర్ల ఏర్పాటు, లైన్లో ఆధునీకరణ పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వలన భవిష్యత్తుల్లో విద్యుత్ వ్యవస్థ మొత్తం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోనుందని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడమనేది కోరడమే కాకుండా రెగ్యులర్ ఉద్యోగులను కాంట్రాక్ట్ వ్యవస్థలో నెట్టవేయబడే దారుణమైన పరిస్థితి ఎదురవుతుందని, భవిష్యత్తులో డీఏలు, అరియర్స్, బోనస్ అనేవి ఉండవన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీకి దేశం అన్నా, దేశ ప్రజలన్నా పట్టడం లేదని, కేవలం ఆదాని, అంబానీలను ప్రపంచ కుబేరులుగా చేయాలని లక్ష్యంతోనే పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సంఘటిత అసంఘటిత కార్మికులందరు ఐక్యమై, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులను కలుపుకొని, ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ భారీ స్థాయిలో ఐక్య ఉద్యమాలు చేపట్టాలని, అందుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 13గంటల పని విధానాన్ని తీసుకురావాలని కేంద్రంలో మోడీ చెప్పిన వెంటనే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానని ఆమోదించడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్లోని విద్యుత్ రంగ సంస్థలు లక్షా 2 వేల కోట్ల రూపాయలు అప్పుల్లో కూరుకపోయాయని ఇందుకు పాలకుల తీరే కారణమన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో దేశాభివద్ధిని దష్టిలో ఉంచుకొని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేకునేందుకు మరో స్వాతంత్ర ఉద్యమం అవసరమని, రాజీలేని పోరాటాలకు కార్మికులందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈసదస్సులో పాల్గొన్న అనేక సంఘాల నాయకులందరూ ఐక్యంగా ఈనెల 20వ తేదీ విజయవాడ కేంద్రంగా జరిగే భారీ పోరాటం, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసదస్సులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, స్ట్రగుల్ కమిటీ కార్యదర్శి సుబ్బిరెడ్డి, ట్రబుల్స్ కమిటీ నాయకులు ముస్తాఫ్ అహ్మద్, ఎల్.రాజు, శివశంకర్, జాకీర్ హుస్సేన్, గంగయ్య, సుమన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నరసింహులు, శేఖర్, గిరిబాబు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా 'ముసలిమడుగు'



ముసలిమడుగు ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- పలమనేరు: ముసలిమడుగు పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు మండల పరిధిలోని ముసలిమడుగు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలని అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఈప్రాంతానికి ప్రజలు మరింతగా వస్తారని, ఇక్కడే వనమహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు త్వరితగతిన పనులు చేపట్టాలని తెలిపారు. ఏనుగులను ప్రధాన వేదికకు సురక్షితమైన దూరంలో, మహావత్లు, వెటర్నరీ సిబ్బంది పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. ఏనుగుల ప్రాంతం చుట్టూ పరిశుభ్రత, బ్యారికేడింగ్ వంటి ఏర్పాట్లు చేయాలనానరు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సుబ్బరాజు, అడిషనల్ డీఎఫ్ఓ పలమనేర్ డివిజన్ నారాయణ, ఆర్డీవో భరణి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

- **వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు: కలెక్టర్**

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం వైద్యం అందజేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ కేంద్ర ఆరోగ్య మిషన్ బృందం, జిల్లాలో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య రంగంలో వివిధ అంశాలపై పవర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ కమిటీ బృందానికి వివరించారు. దేశ వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కార్యక్రమాల అమలు, ఆరోగ్య వ్యవస్థల పనితీరు పరిశీలనకు కేంద్ర ఆరోగ్య- కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) బృందం చిత్తూరు జిల్లాలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు పర్యటిస్తారు. అందులో భాగంగా కేంద్ర ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖలోని పోషకాహార, అనుబంధ ఆరోగ్య సేవల ఉప కమిషనర్ డాక్టర్ జోయా అలీ రిజ్వీ నేతృత్వంలోని 12 మంది సభ్యులతో కూడిన బృందం జిల్లా కలెక్టర్ కలిశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చులో ఎక్కువ వైద్య సేవలు అందించే లక్ష్యంతో కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా టాటా డిజిటల్ నేర్వే సెంటర్ మంచి ఫలితాలు సాధించుచున్నదని, జిల్లా అంతట ఈకార్యక్రమాలు నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య వ్యవస్థలో ఒక జిల్లా సమగ్ర ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంపై టాటా ఎండీ, మైనా మహిళా అండ్ కేర్ ఎన్ గ్రోతో భాగస్వామ్యంతో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించడానికి చిత్తూరు జిల్లా సంజీవిని ప్రాజెక్ట్‌ను స్మార్ట్ మోడల్‌గా ప్రయోగాత్మకంగా ప్రారంభించి మంచి ఫలితాలు సాధించుచున్నామని వివరించారు. హైబ్రి ఎంఎంయు, హబ్- ల్యాబ్ మోడల్‌ని ఉపయోగించి ఎన్‌సిడి సస్పెంట్, ధృవీకరించబడిన కేసుల కోసం ఉచిత డయాగ్నస్టిక్స్ పైలట్ అమలు చేయడం జరిగిందని వివరించారు. అధిక ప్రమాదం, తీవ్రమైన రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలందరికీ డెలివరీకి ముందు డిజిటల్ మెటర్నల్ టూల్స్ ఆశా శిక్షణ రిఫ్రెషర్ల కోసం మొబైల్ అకాడమీ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ స్క్రీనింగ్, ఇతర పరీక్షల కోసం భవ్యా హెల్త్ సర్వీసెస్ సంస్థ 3 హబ్‌లను ఏర్పాటు చేసిందని ఈ హబ్‌లలో సుమారు 90వేల మంది రోగుల రక్త నమూనాలు అత్యాధునిక పరికరాల ద్వారా పరీక్షించబడతాయని వీటిలో హీమటాలజీ అనలైజర్, ఫుల్ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్, ఎలక్ట్రోలైట్ అనలైజర్ వంటి ఆధునిక పరికరాలు ఉన్నాయని తెలిపారు. ఈ హబ్‌లలో కంప్లీట్ బ్లడ్ పిక్చర్, బ్లడ్ గ్లూకోస్ టెస్టులు, లివర్ ఫంక్షన్ టెస్టులు, కిడ్నీ ఫంక్షన్ టెస్టులు వంటి నిర్ధారణాత్మక పరీక్షలు నిర్వహించబడతాయని, ఇవి వ్యాధి భారాన్ని అంచనా వేయడానికి కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు.



జాతీయ కేంద్ర ఆరోగ్య మిషన్ బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్

మరో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- **వారం రోజుల్లో ఇద్దరు 'సీతమ్స్' విద్యార్థుల వరుస ఆత్మహత్యలు**
- **కళాశాల ఎదుట ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల్లో వారం రోజుల లోపే ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అక్టోబర్ 31వ తేదీ శుక్రవారం ఇదే కాలేజీలో బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్న జీడీ నెల్లూరు మండలం సామిరెడ్డిపల్లికి చెందిన నందినియాజమాన్యం వేధింపులు తాళలేక భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతోంది. తాజాగా చిత్తూరు నగరంలోని సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన మంగళవారం బిటెక్ డేటా సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్న రుద్రమూర్తి(19)కళాశాల భవనంలోని మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే కళాశాల సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రుద్రమూర్తి మృతి చెందిన్నట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ సంఘటనపై మృతుడు తల్లి తులసి, బంధువులు, స్నేహితులు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యం వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నట్లు కూడా తనకు సమాచారం ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం దాచి పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కొడుకు మృతిపై సమగ్ర విచారణ జరపాలని, కళాశాల హెచ్ఓడి సమాధానం చెప్పాలంటూ కళాశాల ఎదుట బైఠాయించారు. సిఐ నిత్యాబాబు, పూతలపట్టు సిఐ కత్తి శ్రీనివాసులు సీసీ పుటేజ్ ఇస్తామని విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రుద్రమూర్తి (ఫైల్‌ఫొటో)



మృతిచెందిన రుద్రమూర్తి

విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

సీతమ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ ఘటన పై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. వారం వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం అంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం నందిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదని తెలిపారు. మంగళవారం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న రుద్రమూర్తి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుని చనిపోవడం చూస్తుంటే యాజమాన్యం వేధింపులు ఏమేరకు ఉన్నాయో అర్థమవుతుందని అన్నారు. ఈ ఘటనపై ఉన్నత విద్యామండలి ప్రభుత్వం జిల్లా అధికారం సమగ్ర విచారణ జరిపి సీతమ్స్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముళ్ల పొదల్లో పసికందు..

- **ఏడుపు విని అక్కున చేర్చుకున్న గ్రామ మహిళలు**
- **అధికారుల ఆధ్వర్యంలో శిశు విహార్‌కు తరలింపు**



ప్రజాశక్తి- సోమల: అప్పుడే పుట్టిన ఆడబిడ్డను ఓ కసాయి తల్లి ముళ్ల పొదలలో వదిలి వెళ్లింది. పాప ఏడుపు విన్న సులోచన అనే మహిళ శిశువును కాపాడగా విషయం తెలుసుకున్న అధికారులు పాపను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం చిత్తూరులోని శిశువిహార్‌కు తరలించారు. సోమల మండలం ఎస్ నడింపల్లి గ్రామంలోని ఎర్రంవారిపల్లి గ్రామసమీపంలోని ముళ్లపొదల్లో మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పాప ఏడుపు వినిపిస్తూ ఉండడంతో సమీపంలోని ఇంటిలో ఉన్న సులోచన అనే మహిళ అక్కడికి వెళ్లి పాపను ముళ్ళ పొదలలో నుండి తీసుకువచ్చి గ్రామస్తులకు తెలిపింది. దీంతో గ్రామంలోని మహిళలు ఆ చిన్నారిని అక్కున చేర్చుకొని పాపకు స్నానం చేయించి మంచి బట్టలు వేసి పాలు తాగించారు. నవ మాసాలు మోసిన తల్లికి చిన్నారి బరువైందో ఏమో అనాధను చేసి వెళ్ళిపోయింది.. ఎంత కఠినంగా బిడ్డను వదిలి వెళ్ళింది.. అంటూ మహిళలు తల్లిని శాపనార్థాలు పెట్టడం కనిపించింది. ఎప్పుడు ప్రసవించిందో ఎక్కడ ప్రసవించిందో తెలియదు కానీ ముళ్ళ పొదలలో పడవేయడంతో చిన్నారికి వీపు చేతులు మొహంపై చిన్నచిన్న గాయాలు అయ్యాయి. నల్ల చీమలు పాప చుట్టూ చేరి ఉండడంతో పాపను చీమలు కరిచి ఉంటాయని కుక్కలు గుర్తించకపోవడంతో పాప బతికిందని లేకుంటే కుక్కలు చంపివేసి ఉంటాయని మహిళలు అన్నారు. కాగా పాప దొరికిన ప్రదేశంలోని రక్తపు మరకలు కూడా ఉండడంతో అక్కడే ప్రసవించి పాపను ముళ్ళ పొదలలో వేసి వెళ్లారా లేక ఎక్కడైనా ప్రసవించి అక్కడికి తీసుకువచ్చి వదిలి వెళ్లారా అన్న విషయం అర్థం కావడం లేదు. విషయం తెలుసుకున్న మహిళా పోలీసు గౌతమి, అంగన్వాడీ కార్యకర్తలు చంద్రకళ, రత్నమ్మ, అంగన్వాడి సూపర్వైజర్ హరిత హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పాపను ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యసేవలు అందించారు. పాప 2.5 కేజీల బరువు ఉందని ప్రస్తుతానికి ఆరోగ్యంగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. 108 వాహనం ద్వారా ఐసిడిఎస్ సిబ్బంది వైద్య సిబ్బంది ఆశాకార్యకర్తలు చిత్తూరుకు తీసుకువెళ్లి శిశు విహార్ కు అందజేయనున్నట్లు తెలిపారు.



చిన్నారితో వైద్య బృందం మహిళా పోలీసు ఐసిడిఎస్ సిబ్బంది

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- **పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు**
- **అవస్థలు పడుతున్న ప్రజలు**


ప్రజాశక్తి- నగరి (విజయపురం)

నగిరి పట్టణ పరిధి 11వ వార్డులో డ్రైనేజ్ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పట్టణ పరిధిలో మొత్తం 26 వార్డులు ఉన్నాయి. పట్టణ ప్రజలు వాడే వ్యర్థపు నీరు మొత్తం చిన్న కాలువలు ద్వారా 11వ వార్డులో ఉన్న పెద్దకాలువకు వచ్చి చేరుతుంది. ఆ కాలువను శుభ్రం చేయవలసిన బాధ్యత మునిసిపాలిటీ అధికారులకు ఉన్నా వాటిని పట్టించుకోలేదు. దీంతో దీర్ఘకాలంగా నిలిచి ఉన్న మురికినీటి నుంచి దుర్వాసన రావడంతో పాటు చెత్తచెదారం చేరి కుళ్ళినవాస వస్తోందని, ఈ వాసన భరించలేక ముక్కు మూసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది, ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. గతంలో పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు సమస్యను వివరించి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మురుగు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందడం వలన నిత్యం ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకొని మురికి డ్రైనేజ్ కాలువను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

నెలల తరబడి పూడికపోయిన కాలువ..

మాంగాడు చెరువుకు వెళ్లే కాలువ పూడిపోవడంతో మురికినీరు ముందుకు పోవడం లేదు దీంతో 11వ వార్డులో మురికి నిలిచి పక్కనే ఉన్న ప్లాట్ ఇండ్ల మధ్యలో పారుతున్నాయి. దీనికి తోడు కాలువలో పందులు ఉండడంతో దుర్వాసన మరింత ఎక్కువగా ఉందని స్థానిక ప్రజలు అంటున్నారు. దోమకాటు వలన రాత్రిపూట కంటి మీద కునుకులేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాంగాడు చెరువుకు వెళ్లే కాలువల పూడికతీత పనులు చేపడితే 11వ వార్డులో నిలిచి ఉన్న మురికి కాలువ వెళ్లడం మార్గం సులువు అవుతుందని స్థానిక ప్రజలు అంటున్నారు.

కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పుత్తూరు రోడ్డు సాంబయ్య కండ్రిగ నుండి ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ప్రజాప్రతినిధులుతో కలిసి పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం వేగంగా పనులు చేస్తున్నట్లు చెప్పారు. నగరవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన..


నగరపాలక పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరిశీలించారు. మొత్తం ఏ, బి, సి బ్లాక్ లో ఎన్ని గృహాలు పూర్తి చేశారు? ఇంకా పెండింగ్ పనులు ఏం చేయాలనే అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. మూడు బ్లాకుల పరిధిలో పూర్తిస్థాయిలో సిద్ధం చేసిన 528 గృహాలను లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఎ బ్లాక్‌లో 240, బి బ్లాక్‌లో 144, సీ బ్లాక్లో 46 గృహాలను లబ్ధిదారులకు అందించనున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా గృహాలను పరిశీలించారు. అప్రోచ్ రోడ్డులో మూడురోజుల్లో పూర్తి చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికుల వినతి మేరకు తాగునీటి సమస్య పరిష్కరించందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, టిడ్కో ఈఈ దేవిక, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు పాల్గొన్నారు.



టిడ్కో ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

మార్కెట్ యార్డ్‌లో అసాంఘిక కార్యకలాపాలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)



నగిరి పట్టణ పరిధిలోని మార్కెటీ యార్డ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మార్కెట్ యార్డులోని కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయాన్ని గిడ్డంగి పక్కనే ఉన్న మరో భవనానికి మార్చారు. ఖాళీగా ఉన్న భవనం చుట్టూ కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ప్రజల వాదనకు సాక్ష్యాలు కనిపిస్తున్నాయి. మార్కెట్ యార్డుకు కూతవేటు దూరంలో మద్యం షాపు ఉంది. అక్కడ మద్యం తీసుకున్న మందుబాబులు నేరుగా మార్కెట్ యార్డ్ లోపల వచ్చి మద్యం తాగి, మద్యం బాట్లను అక్కడే పడేస్తున్నారు. మరి కొందరు తాగిన మత్తులో మద్యం బాటను పగలకొట్టడంతోపాటు భవనం చుట్టూ వ్యర్థాలను చల్లాచెదురుగా పడేసి వెళ్లిపోతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసిన ఏమీ పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా సాయంత్రం సమయంలోనూ కొందరు మార్కెట్ యార్డ్ లోపల చెట్ల మద్యం తాగుతున్నట్లు చెబుతున్నారు. స్థానిక మహిళలు దేశమ్మ గుడి వైపుగా మార్కెట్ యార్డు మీదుగా రోజూ వాకింగ్ కోసం ఉదయం, సాయంత్రం తిరుగుతుంటారు. మందుబాబుల అరాచకాలకు మహిళలు భయాందోళనకు గురవుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని, మందుబాబు ఆరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పుంగనూరులో అభివృద్ధి శూన్యం..

- **23 వేల టన్నుల చెత్తను వదిలేసిన ఘనత పెద్దిరెడ్డిది..**
- **తండ్రీకొడుకు దోచుకుతిన్నారు..: పట్టాభిరామ్**



డంపింగ్ యార్డును పరిశీలించిన స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరులో అభివృద్ధి శూన్యమని, ఎంపీ, ఎమ్మెల్యేలు తండ్రీకొడుకులు ఇక్కడ దోచుకు తిన్నారని స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ ఆరోపించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పాల్గొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ తండ్రీకొడుకులు ఇద్దరు ఈ ప్రాంతాన్ని దోచుకుతిన్నారే కానీ అభివృద్ధిపరంగా ప్రజాసమస్యలు తీర్చే విధంగా ఏ ఒక్క కార్యక్రమం చేపట్టలేదని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. పుంగనూరు పట్టణంలో 23వేల టన్నుల చెత్తను కుప్పలుకుప్పలుగా వదిలేసిన పరిస్థితి గత ప్రభుత్వం చేసిందన్నారు. చెత్తమీద పన్ను వేసి ప్రజల నుండి ముక్కుపిండి వసూలు చేశారన్నారు. మీరు వదిలేసిన చెత్తను కూటమి అధికారంలోకి వచ్చాక తాము తొలగించామన్నారు. అందుకే ఇక్కడ శాసనసభ్యుడు పెద్దిరెడ్డిని పుంగనూరు పుడింగి అంటారా అని, మున్సిపల్ కార్యాలయంలో వాహనాలు మూలనపడ్డాయని వాటిని ఎప్పుడైనా గమనించారని ప్రశ్నించారు. మీరు మాత్రం కోట్ల రూపాయలు విలువ చేసే బెంజ్ కార్లు, ల్యాండ్ క్రూజర్లు విలాసాలుకు వాడుతున్నారన్నారు. పుంగనూరు మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో తాము అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పది ఎలక్ట్రిక్ వాహనాలను ప్రతి ఇంటికి వెళ్లి చెత్త తీసుకెళ్లేందుకు ఉపయోగపడే వాటిని మున్సిపాలిటీ అందిస్తామన్నారు. అలాగే డీజిల్ భారం తగ్గించేందుకు మరో రెండు కాంపాక్ట్ వాహనాలు కూడా అందిస్తామన్నారు. దీంతో పుంగనూరు మున్సిపాలిటీకి రూ.50 లక్షలు డీజిల్ అదా అవుతుందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో దాడులు, దౌర్జన్యాలు తప్పితే మీరు చేసింది ఏమీ లేదని సూటిగా అడుగుతున్నానన్నారు. కౌండిన్య నదికి శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేస్తామన్నారు. వ్యర్థ పదార్థాలను వేరు చేసే ప్రక్రియను కూడా ప్రారంభించామన్నారు. ఈసందర్భంగా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, చిత్తూరు కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ సమీపత్ యాదవ్, పోలీస్ గిరి, నాయకులు సివి.రెడ్డి, శ్రీకాంత్, మాధవరెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీటి తొట్టె

- పాఠశాల ఆవరణలో నిరుపయోగం
- పట్టని అధికారులు
- ప్రమాదం జరిగితే కానీ స్పందించరా?

ప్రజాశక్తి -వికోట : నిత్యం వందలాది మంది విద్యార్థులు పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు సంచరించే పాఠశాల ఆవరణలో నేలపై ఉన్న నీటి తొట్టె అధికారులకు కనపడకపోవడం శోచనీయం. 'ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా?' అంటూ స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొన్ని సంవత్స రాల క్రితం అంబేద్కర్ భవన నిర్మాణం కోసం నీటి వినియో గానికి గుత్తేదారు నేలపై ఈ నీటి తొట్టెను నిర్మించారు. కొన్ని అనివార్య కారణాలతో అంబేద్కర్ భవన నిర్మాణం ఆగిపోవడంతో పాటు పనులు నిలిచిపో యాయి. భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టె పూర్తి స్థాయిలో నీరు చేరి చెత్తాచెదారంతో నీరు కలుషితమైంది. తొట్టి చుట్టూ పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున పెరిగి పోయాయి. పాఠశాల ప్రధాన గేటుకు అతి సమీపంలో ఈ నీటి తొట్టి ఉండడం వల్ల ప్రమాదవశాత్తు పిల్లలు ఆడు కుంటూ ఎవరైనా అందులో పడితే పెను ప్రమాదం సంభ వించే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. గతంలో కొన్ని మూగజీవాలు అందులో పడటంతో స్థాని కులు వాటిని రక్షించిన సందర్భాలూ వున్నా యి. బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణం లోనే, బాలుర వసతి గృహం కూడా ఉండడంతో నిత్యం విద్యార్థులు ఆ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద కరంగా ఉన్న నీటి తొట్టెపై మూతను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం చోటుచేసు కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరు తున్నారు.


నేలపై నిరుపయోగంగా వున్న నీటి తొట్టె

ప్రభుత్వ భూముల ఆక్రమాలపై విచారణ


రైతులను విచారిస్తున్న ఆర్‌డివో శ్రీనివాసులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం పాత వెంకటా పురం పంచాయతీ బొజ్జి నాయన పల్లిలో తమిళ నాడు వాసులకు ప్రభుత్వ భూము లు అక్రమంగా ఇచ్చారని వచ్చిన ఫిర్యాదుపై ఆర్‌డివో శ్రీనివాసులు మంగళవారం విచారణ నిర్వహించారు. చిత్తూరు ఆర్డీవో ఎం శ్రీనివాసులు, గంగాధర నెల్లూరు తహశీల్దారు సికె శ్రీనివాసులు ఈ ఫిర్యాదుపై గ్రామ స్తులను విచారించారు. ఈ గ్రామంలో తమిళనాడు వాసులకు 100 ఎకరా లకు పైగా డీకేటి పట్టాలు, పాసుబుక్‌లు అక్రమంగా ఇచ్చారని ఫిర్యాదు అందిందని తెలిపారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామ రైతులను విచారించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గణేష్, వీఆర్వో కందస్వా మి, విలేజ్ సర్వేయర్ అవినాష్ హాజరై వివరాలను తెలిపారు.

వైసిపి కార్యకర్తకు పరామర్శ


నరసింహులును పరామర్శిస్తున్న నారాయణస్వామి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజక వర్గం కార్వేటినగరం మండ లం సిఆర్‌కండ్రిగకు చెందిన సర్పంచ్ మామ, వైసిపి సీనియర్ నాయకుడు జి నరసింహులు అనారోగ్యంతో తిరుపతి సిమ్స్‌లో చికిత్స పొందు తున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మంగళవారం నరసింహులును పరామర్శించి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడా పోటీలకు డీఎంపురం విద్యార్థులు


రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటి నగరం మండలం లోని డీఎంపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థు లు రాష్ట్ర స్థాయి రగ్బీ, నెట్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరస్వతి, వ్యాయామ సంచా లకులు కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం సరస్వతి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అండర్ 17 బాలికల విభాగం నుండి 10 తరగతి యామిని, బాలుర నుండి సాయి కిరణ్, అండర్ 14 నుండి ఎంపికైన ఇంద్రజలను హెచ్‌ఎం సరస్వతి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్య చంద్రశేఖర్ లు అభినం దించారు. వాయల్పాడులో జిల్లా స్థాయిలో నిర్వహించిన నెట్ బాల్ పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన కె ఆకాష్‌ను పీడీ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు మాలతి, కల్లె వాణి, రవి, బొజ్జా రాములు, సిఆర్‌పి కార్తవరాయ, రాములు, రంజిత్ కుమార్ అభినందించారు.

గిరిజన కుటుంబాలకు ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్లు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో 411 మంది గిరిజన కుటుంబాలకు నూతన ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్ మంజూరు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ సుమిత్ కుమార్ దీపం–2 పథకం, పిఎంయువై కింద ఎల్‌పిజి కనెక్షన్లను పొందడానికి కావలసిన అర్హతలు, లబ్ధిదారులు అవగాహన కార్యక్రమాలపై సంబంధిత ఆర్డీవోలతో, ఎమ్మార్వోలతో, డిప్యూటీ తహశీల్దార్లతో, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సివిల్ సప్లై అధికారి శంకరన్, సివిల్ సప్లై మేనేజర్ లక్ష్మీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏనుగుల దాడులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం పరిసర ప్రాంతాలలోని వ్యవసాయ పంటలపై ఏనుగుల దాడులు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున దేవళంపేట, పాల్యం పంచాయతీలలో ఏనుగుల గుంపు దాడులు చేశాయి. వరి పంట, మామిడి చెట్లు తొక్కి విరిచి వేశాయి. ప్రతి రోజు ఈ ఏనుగుల గుంపు దాడులతో పంటలు ధ్వంసం అవుతున్నాయి. మంగళవారం జరిగిన దాడిలో రైతులు రవికుమార్, అమర్నాథ్ రెడ్డిలకు అపార నష్టం వాటిల్లింది. అటవీశాఖ అధికారులు ధ్వంసం అయిన పంటలను పరిశీలించారు, రైతులకు పరిహారం ఇవ్వడం నిత్యం జరుగుతూనే ఉంది. ఈ క్రమంలో అటవీశాఖ సిబ్బంది ప్రజలను నిత్యం తీవ్ర అప్రమత్తం చేస్తున్నారు. దీంతో ఏనుగుల జాడ తెలుసుకునేందుకు అడవుల్లో డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు. ఏనుగు దాడులు అటవీశాఖ అధికారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. డ్రోన్ కెమెరాల ద్వారా ఏనుగుల జాడను గుర్తించి పంటలను కాపాడడం కోసం అటవీశాఖ అధికారులు శ్రమిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏనుగుల బారి నుండి ఉపశమనం కలిగించే చాలు అని రైతులు వ్యక్తపరుస్తున్నారు.


సర్పంచ్ చొరవతో ముళ్ల కంపలు తొలగిస్తున్న దృశ్యం

సర్పంచ్ చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గత కొన్ని సంవత్సరాలుగా చెట్లు , ముళ్ల కంపలతో ఇబ్బందికరంగా మారిన బొమ్మ వారి పల్లి శ్మశాన వాటికను సర్పంచ్ నీలావతి సుధాకర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా దాన్ని మంగళవారం శుభ్రం చేయించారు. పక్కనే పెద్ద చెరువుకు పోతున్న సప్లై ఛానల్ కూడా శుభ్రం చేయించి అడ్డంకులు తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ రామ్మూర్తి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చైతన్య కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కార్యకర్తలకు ఎమ్మెల్సీ పిలుపు

ప్రజాశక్తి -కుప్పం: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు టిడిపి శ్రేణులు సన్నద్ధం కావాలని, కూటమి అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం మండలం వి మిట్టపల్లిలో మంగళవారం టిడిపి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం సాధించాలని పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఏపి ఐఐ సి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మండల అధ్యక్షుడు రాజగోపాల్,మాజీ ఎంపీపీ సాంబశివం, ఏఎంసీ డైరెక్టర్ వెళ్ళేప్ప, సర్పంచ్ సంతోష్ నాయకులు ఏవి రవి చలపతి, లీల వెంకటేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

ఘనంగా జెవివి చెకుముకి సంబరాలు


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ దిలీప్‌కుమార్

ప్రజాశక్తి -కార్వేటినగరం : జన విజ్ఞాన వేదిక 35వ చెకుముకి సైన్స్ సంబరాలు మండల స్థాయిలో మంగళవారం నిర్వ హిం చారు. పరీక్షలలో స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. మండలంలో 13 ఉన్నత పాఠశాలలో పాల్గొనగా శ్రీ లక్ష్మీనరసింహ హై స్కూల్ విద్యార్థులు సుజన శ్రీ, పదవ తరగతి , దివ్య 9వ తరగతి, దర్శిత 8వ తరగతి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఎంఈవోలు ఏం విజయకుమార్ , డిపి మనోజ్ కుమార్ చేతులు మీదగా ప్రశంసాపత్రం అందు కున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికి తీయ డానికి చెకుముకి పరీక్షలు ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. డైరెక్టర్లు జి ధనంజయ రెడ్డి, ఎస్ వెంకటేష్ , ఎ పురుషోత్తం విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జెవివి కన్వీనర్ వేణుగోపాల్ , హైస్కూల్ హెచ్‌ఎం లత, సైన్స్ టీచర్ అను, అధ్యాపకులు రాజశేఖర్, పృథ్వి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ కార్వేటినగరంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలు రెండు ప్రైవేటు పాఠశాలలు ఈ పోటీలలో పాల్గొన్నాయి. ఈ పోటీలలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో రాణించారు. ఈ కార్యక్రమం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ విజయకుమార్, ఎంఈఓ మనోజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం జెవివి కన్వీనర్ వేణుగోపాల్, మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం , ఉన్నత పాఠశాల నుండి సైన్స్ ఉపాధ్యాయులు భారతి, రాజేంద్ర, రామ్మోహన్, చిత్ర, సరిత, గీత, వరలక్ష్మి, కస్తూరి, గురుమూర్తి, రాములు, పురుషోత్తం, రీటా వేణుగోపాల్, కన్నయ్య, శశికపూర్, మునీంద్ర వేణుగోపాల్ రెడ్డి, ఓ రవి, కోమలేశ్వరి, జయదేవ్ పాల్గొన్నారు.

ఐరాల: జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు సంబరాలు స్థానిక బిఎస్ కన్నన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల మండలాల విద్యార్థులు 48 జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా జిజెఎం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చెన్నకేశవులు నాయుడు నగర అధ్యక్షులు జి సుధాకర్ హాజరయ్యారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో చిత్తూరు అర్బన్ నుండి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో వివిధ పాఠశా లలు బహుమతులు సాధించాయి. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు హెచ్ అరుణ శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు జయంతి , చిత్తూరు ఎంఈఓ లు సెల్వరాజ్ ,మోహన్ ,కన్నన్ పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కోమల, సుదర్శన్,రాజశేఖర్, పుష్పావతి మనోహరి, నీలిమ పాల్గొన్నారు.

పుంగనూరు: మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ స్థానిక బసవరాజు హై స్కూల్ ఆవరణలో జెవివి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పాఠశాల స్థాయి నుండి మండల స్థాయికి 13 స్కూలు నుండి 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన కొత్త ఇం డ్లు మున్సిపల్ హై స్కూల్, ప్రైవేట్ స్కూల్ కృష్ణారెడ్డి చైతన్య స్కూలుకు జిల్లా స్థాయికి రెండు టీంలు ఎంపిక య్యారని జెవివి అధ్యక్ష కార్యదర్శులు బి రామలింగప్ప, వై సుశీలమ్మ తెలిపారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు ఎంఈవో విద్యాశాఖ అధికారి నటరాజ ప్రశంసాపత్రాలను అందిం చారు. కృష్ణారెడ్డి చైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థులకు ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.


పుంగనూరు

బంగారుపాళ్యం: మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెవివి అధ్యక్ష కార్యదర్శులు పిల్లారప్ప రామచంద్ర ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వ హిం చారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుండి 22 టీమ్ లు పాల్గొ న్నాయి. గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు రాము బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, ఎంఈఓ 2 రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్రన్ పాల్గొన్నారు.

పలమనేరు: జెవివి మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు స్థానిక బాలికల ఉన్నత పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలలో పలమనేరు, గంగవరం మండలాల నుండి 105 మంది విద్యార్థులు (35 టీములు) పాల్గొని చెకుముకి పరీక్ష రాశారు. సునీల్ బహు మతులు అందించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు జెవివి ప్రధాన కార్యదర్శి సుదర్శనాచారి, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, శ్రీపురం సీతారామయ్య, నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్ బాబు, కల్లుపల్లి ప్రధాన ఉపాధ్యాయుడు చైతన్య, కోశాధికారి గిరిధర్ మూర్తి, సిద్ధార్థ, దేవేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం ఆవలకొండ గ్రామా నికి చెందిన ప్రభు త్వ ఖాజీ మౌలానా అలీ అక్బర్ ఆదేశాల మేరకు అంజుమన్ అబ్బాసియా కమిటీ చైర్మన్ నియాజ్ అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రహమత్ అలీ, మత గురువు నబీల్ రజా ఆధ్వర్యంలో తూగుండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 315 మందికి మధ్యాహ్న భోజనం తినేందుకు 315 స్టీల్ ప్లేట్లు ఉచితంగా అందించారు. ఆ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రాజేంద్ర నాయుడు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కాణిపాకం సుధాకర్ శెట్టి సమక్షంలో ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ ప్రెసిడెంట్ కార్యదర్శి యగ్బాల్ హుస్సేన్ , ట్రెజరర్ షాకీర్ అలీ, కార్యదర్శి మెహిది అలీ, ముస్లిం నేతలు మక్తుమ్ అలీ , వాహిద్ అలీ, హసిమ్ అలీ, పలువురు టీచర్ లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపల్లి రెస్కో కార్యాలయం సందర్శన

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి రెస్కో కార్యాలయాన్ని రెస్కో డైరెక్టర్ తులసినాథ్ మంగళవారం సందర్శించారు. రెస్కో డైరెక్టర్ హోదాలో కార్యాలయంలోని వివిధ రికార్డులను ఆయన పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. రెస్కో కార్యాలయానికి... కార్యాలయం తెలిపే బోర్డు లేదని వెంటనే ఏర్పాటు చేయాలని ఏఈని ఆదేశించారు. ఈ క్రమంలో రైతుల బాధలు అడిగి తెలుసుకున్నారు. కనెక్షన్ల పనికి రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఒకవేళ వారికి ఇస్తే తప్పక రసీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, అదే సమయంలో పాత బకాయిలు వసూలు చేయాలని ఆయన రెస్కో గుడిపల్లి అధికారులకు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: భారత రాజ్యాంగం దినో త్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి వాణిశ్రీ ప్రథమ స్థానం సాధించింది. ఈ విజయంతో ఆమె ఈ నెల 26వ తేదీ అమరావతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నది. పరిణిత విజయంపై పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడు కె. దశరథన్ ఆమెను అభినందించారు. ఎంఈఓ లు జనార్ధన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులను మరియు విజేత విద్యార్థినిని అభినందించి, రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.



వంతెనకు మరమ్మతులు

ప్రజాశక్తి-తవణంపల్లి: మండల పరిధిలోని అరగొండ మార్గ మధ్యలో ఏ గొల్లపల్లి రోడ్డు వంతెన వర్షాల కారణంగా అరగొండ మేజరు పంచాయ తీలో ఏగొల్లపల్లికి వెళ్లే మార్గంలో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లపల్లి సర్పంచ్, టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి సబితా ప్రవీణ్, ప్రవీణ్ నాయుడు ప్రోత్సాహంతో మంగళవారం వంతెనకు మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు .వెంకటేష్ చౌదరి, ఆర్ అండ్ బి జేఈ తవణంపల్లి ఎంపీడీవో సుభాష్ నాయుడు, కొండరాజు కాలువ సునీల్‌నాయుడు, అరగొండ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల భూమిపై వివాదం

- తహశీల్దారు పరిశీలన
- కలెక్టర్‌కి నివేదిక



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్ద చెల్లారిగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 174/7లో 1.26 ఎకరాల భూమి హక్కులపై వివాదం చెలరేగింది. ఈ భూమిని తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్‌సిలు నారాయణప్ప, కృష్ణప్ప, శంకరప్ప కుటుంబాలు తమ తాతల కాలం నుంచే సాగు చేసుకుంటూ జీవనాధారంగా చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే, ఇటీవల గ్రామంలోని అగ్రకులస్తులైన జి అశోక్ కుమార్, ఆయన భార్య గౌరమ్మ రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఈ భూమిని తమ పేర్లకు పట్టా మళ్లించు కున్నారని బాధిత కుటుంబాల వారు ఆరోపించారు. భూమి రికార్డులు తమ పేర్లకు మార్చిన విషయం తమకు తెలియ కుండానే సాగిందని, తర్వాత అశోక్ కుమార్ దంపతులు దౌర్జన్యంగా ప్రవర్తించారని నారాయణప్ప కుమారుడు చంద్రప్ప మీడియాకు తెలిపారు. మంగళవారం తహశీల్దారు ప్రసన్నకుమార్, పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది భూమి వద్దకు వెళ్లి సర్వే నిర్వహిం చేందుకు ప్రయత్నించగా, ఎస్సీ కుటుంబాలు అక్కడికి చేరుకుని తమ అన్యాయాన్ని వివరించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా భూమి వద్దకు రావడం సరికాదని వారు ఆక్షేపించారు. ఈ సందర్భంగా తహశీల్దారు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సాగుచేస్తున్నా వారికి న్యాయం చేస్తామన్నారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఇద్దరూ సద్దుమణిగి ఉండాలని సూచించారు. స్థానికులు మాట్లాడుతూ ఎస్సీ కులాల కుటుంబాలు ఎన్నేళ్లుగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న భూమిని అక్రమంగా ఇతరుల పేర్లకు మళ్లించడం దారుణమని, అధికారాలు ఈ వ్యవ హారాన్ని నిష్పక్షపాతంగా విచారించి ఎస్సీ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

7న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-గుడిపల్లి : ఈ నెల 7వ తేదీ గ్రీన్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో మొట్టమొదట ద్రావిడ విశ్వవిద్యాలయంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. ముందు 5, 6వ తేదీ ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని 7వ తేదీ ఇంటర్వ్యూకు హాజరు కావాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య వి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని కుప్పంలోని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాతోనే అభివృద్ధి..

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -సోమల: పుంగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసింది ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డే నని అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా ఇంతవరకు ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు తెలపాలని అవగాహన లేకుండా విమర్శలు చేయడం సబబు కాదని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి అన్నారు. సదుంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ పుంగనూరు నియోజకవర్గానికి వచ్చి ప్రస్తుత ఎమ్మెల్యే రామచంద్రారెడ్డిని, ఎంపీ మిథున్ రెడ్డిని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని తమ ప్రభుత్వ హయాంలో పుంగనూరు మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 33 కోట్ల రూపాయలతో రిజర్వాయర్ నిర్మించామని, ఆవులపల్లి, నేతి గుండ్లపల్లి ప్రాజెక్టుల నిర్మాణంతో రైతులకు లబ్ధి చేకూరుతుందని పనులు చేపడితే వాటిని అడ్డుకొని ప్రజలకు ద్రోహం చేశారని, మీరు ప్రజలకు మంచి చేయకపోగా చేసిన వారిపై విమర్శలు చేయడం మీ విజ్ఞతకే వదిలి వేస్తున్నామని, మున్సిపాలిటీలోని పాడైన ట్రాక్టర్లు ఇతర వాహనాల స్థానంలో కొత్త వాటిని మీ ప్రభుత్వం హయాంలో అందించి అభివృద్ధికి సహకరించాలని, గతంలో పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నో అవార్డులు సాధించిందని వీటన్నిటిని గుర్తించాలని హితవు పలికారు. విమర్శలు మాని అభివృద్ధి పనులు చేసి ప్రజలకు మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్యటన

ప్రజాశక్తి-చౌడేపల్లి: రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియా బేగం మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ దర్శించుకున్నారు. తర్వాత ఆమినిగుంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బోరకపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. వీటితోపాటు చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మహిళా పోలీసులకు గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించాలని పోక్సో, బాల్యవివాహాలు చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పీడీ వెంకటేశ్వరి, రిటైర్డ్ ఎస్పి పిసి స్వామి, పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, తహశీల్దార్ పార్వతి, సిడిపిఓ రాజేశ్వరి, ఎంపీడీవో లీలా, మాధవి, ఎస్సై నాగేశ్వరరావు, సూపర్వైజర్లు సులోచన, రాధ, అధికారులు పాల్గొన్నారు.



పాత్రికేయుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని ఆర్‌కె వీబిపేట గ్రామానికి చెందిన రాజ్ టీవీ రిపోర్టరు, జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యులు సాంబశివ ఆచారి ఇటీవల కార్వేటినగరం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. వివిధ పార్టీ నాయకులు వాళ్ల గ్రామానికి వెళ్లి సహాయం అందించారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే విఎం థామస్ కార్యకర్తలతో కలిసి ఆర్‌కెవీబి పేట గ్రామానికి కార్యకర్తలతో కలిసి వెళ్లి పరామర్శించి 50 వేల రూపాయలు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. కూటమి ప్రభుత్వం కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటుందని హామీ ఇచ్చాడు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర రెడ్డి, బిగల రమేష్, ఎమ్మెల్యే సోదరులు రాజా, మురళి కృష్ణ రాజు, మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, పోదుటూరు రాజా, ఢిల్లీ రెడ్డి, హేమంత్ రెడ్డి, జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్, దాసరి గణేష్, చెంగల్ రాయులు, జనసేన నాయకులు రాఘవ, రాజేష్ పాల్గొన్నారు.



పరిశ్రమకు భూముల పరిశీలన

ప్రజాశక్తి-కుప్పం: సాలిడ్ వేస్ట్ నుండి కంప్రెస్డ్ బయోగ్యాస్ తయారు చేసే పరిశ్రమ కోసం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మర్మత్, అధికారులు మంగళవారం భూములు పరిశీలించారు. శ్రేష్ట రెన్యువల్స్ సాలిడ్ వేస్ట్ నుండి కంప్రెస్డ్ బయోగ్యాస్ తయారు చేసేందుకు ఏర్పాటు చేయనున్న పరిశ్రమ కోసం కుప్పం మండలం కృష్ణ దాసనపల్లి సమీపంలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను కృష్ణ దాసిన పల్లి సమీపంలో గుర్తించారు. త్వరలోనే ఈ పరిశ్రమ ఏర్పాటు కానుంది.ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు,మండల అధ్యక్షుడు రాజగోపాల్, సర్పంచ్ సంతోష్, మహేంద్ర, బాలాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ పురుషోత్తం, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు కోర్టుకు కుప్పం టిడిపి నేతలు


ప్రజాశక్తి - కుప్పం: చిత్తూరు కోర్టుకు కుప్పం టిడిపి నేతలు మంగళవారం హాజరయ్యారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు నాయుడు రామకుప్పం మండలం కొల్లుపల్లి లో పర్యటించినప్పుడు చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో టిడిపి నేతలపై పలు కేసులు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు సంబంధించి మంగళవారం కుప్పం నియోజక వర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 30 మందికి పైగా టిడిపి నేతలు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, టిడిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్ పాల్గొన్నారు.

అపోలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'టోటల్ హెల్త్'


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళిమోహన్

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలం టోటల్ హెల్త్, డీబీఎస్‌ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని 'స్వచ్ఛ చిత్తూరు, హెల్తీ చిత్తూరు' అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు టోటల్ హెల్త్ సేవా బృందం చిత్తూరు జిల్లాలోని 121 పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు హైజీన్ అవగాహన కార్యక్రమాలు, సమాజ శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించారు. దాదాపు 20 వేల మంది విద్యార్థులు పాల్గొని, పరిశు భ్రత, ఆరోగ్యంపై ప్రేరణాత్మక చర్యల్లో భాగమయ్యారు. ఈ కార్యక్ర మంలో 'స్వచ్ఛ చిత్తూరు, హెల్తీ చిత్తూరు' అంశంపై పోస్టర్ తయారీ పోటీలు, ప్రతిజ్ఞలు, విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. టోటల్ హెల్త్ క్యాంపస్ తవణం పల్లెలో నిర్వహించిన గ్రాండ్ జిల్లా ఫైనల్‌లో పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్ చౌదరి , ఎంఈవో హేమలత (తవణంపల్లె), బంగారు పాలెం ఎంఈఓ నాగేశ్వర రావు ముఖ్య అతిథు లుగా హాజర య్యారు. ఈ కార్యక్రమంలో అతిథి సత్కారాలు, జ్ఞాపికల ప్రదానం, ఈ కార్యక్రమ స్ఫూర్తిని ప్రతిబింబించే మినీ డాక్యుమెంటరీ ప్రారంభోత్సవం నిర్వహిం చారు. విద్యార్థుల సృజనాత్మక పోస్టర్లు, విజువల్ ఎగ్జిబిట్స్, సమాజ ప్రతిజ్ఞలు ఈ వేడుకను మరింత విశిష్టంగా మార్చాయి. అపోలో ఫౌండేషన్ ప్రారంభించిన టోటల్ హెల్త్ కార్యక్రమం ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణ, విద్య, జీవనోపాధి రంగాలలో సమగ్ర సామాజిక అభివృద్ధి నమూనాలను రూపొం దించడంలో నిబద్ధంగా పనిచేస్తోందని పలువురు పేర్కొన్నారు.

క్రైం న్యూస్


కంటైనర్లను ఢీకొని టీ దుకాణంపైకి దూసుకెళ్లిన లారీ

టీ దుకాణంపైకి దూసుకెళ్లిన లారీ

పలు వాహనాలను ఢీకొనడంతో ప్రమాదం

ప్రజాశక్తి -బంగారుపాలెం: టీ దుకాణంపైకి లారీ దూసుకెళ్లిన సంఘటన మండలంలోని మొగిలి గ్రామం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. బెంగళూరు నుండి చిత్తూరు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ముందు వస్తున్న నాలుగు కంటైనర్లను, ఒక ట్రాక్టరును ఢీకొని రహదారి పక్కనే వున్న టీ దుకాణంపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో వాహనాలు దెబ్బతిన్నాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

వ్యక్తి అరెస్ట్



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వేట తుపాకీ స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కొదల మడుగు పంచాయతీ బండ్ల దొడ్డిలో బసవి రెడ్డి మామిడి తోట గ్రామానికి చెందిన లోక రాజ్ కుమారుడు రెడ్డప్ప వేట తుపాకీ కలిగి ఉండడంతో అతడిని అదుపులో తీసుకుని విచారించగా అడవిలోని వన్య ప్రాణులను వేటాడేందుకు తుపాకిని ఉపయోగిస్తున్నాని అంగీ కరించాడన్నారు. అతనిపై మారణా యుధాలు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐ మల్లప్ప , హెడ్ కానిస్టేబుల్ మురళి పాల్గొన్నారు.

మృతదేహం ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల కేంద్రమైన గంగాధర నెల్లూరు నీవానది ప్రాంతంలో మంగళవారం ఓ మృతదేహం పొదల్లో పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించగా, ఆఖరికి ఆ మృతదేహం గారంపల్లి యువకుడిగా వారి బంధువులు సాయంతో పోలీసులు మంగళవారం గుర్తించారు. మండలంలోని గారంపల్లి గ్రామానికి చెందిన చిన్నబ్బ కుమారుడు సాయికుమార్ స్థానికంగా ట్రాక్టర్ లో కూలి పని చేయడానికి వెళ్లేవాడు. ఆ యువకుడు గత నెల 27 తేదీ నుండి కనబడలేదని పోలీసులకు వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం గంగాధరనెల్లూరు నీవానది ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడ మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు వెంటనే గారంపల్లి వాసులకు గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలించి వెళ్లాలని సమాచారం ఇచ్చారు. దీంతో వారు నీవానది ప్రాంతంలో ఉన్న ఆ మృతదేహం సాయికుమార్‌దేనని తెలిపారు. అతనికి మూర్ఛ వ్యాధి ఉండేదని, కాలకృత్యాలు తీర్చుకునే వెళ్ళినప్పుడు ప్రమాద వశాత్తూ నదిలో పడి చనిపోయి ఉంటారని పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- రామకుప్పం:మండలంలోని బందార్లపల్లి పంచాయతీ యానాది కాలనీలో నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను మంగళ వారం రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభించారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రెస్కో పాలకవర్గం ముందుం టుందన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించినందుకు రెస్కో సిబ్బందికి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గద్దుర, యానాది కాలనీలో పి పోర్ట్ పై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ సతీష్, పెరుమాళ్, బాలరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టిటిడి ఆలయంలో బాలాలయం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఆవుల పల్లె ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో ఈనెల 8,9,10వ తేదీలలో బాలాలయం, సంప్రోక్షణ నిర్వహిస్తున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. రాజగోపురం సంప్రోక్షణ, ఆలయ జీర్ణోద్ధరణకు ఈనెల ఆరవ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు టిటిడి ఆధ్వర్యంలో ఉభయ దారులు, భక్తుల సమక్షంలో సమావేశం నిర్వహించి మూడు రోజులపాటు బాలాలయం, సంప్రోక్షణ నిర్వహించి తీర్థప్రసాదాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ

ప్రజాశక్తి -యాదమరి: ప్రభుత్వ అందిస్తున్న ఇంటర్ మీడియట్ విద్యార్థులకు ఐఐటి, జెఇఇ, ఎన్ఈఈటి మెటీరియల్ ను కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ ఎపి లలిత బాలికలకు అందించారు. బాలికల కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ ఎ.పి. లలిత మేడం గారికి అధ్యాపకులైన కె దామోదర్ రెడ్డి, మధుసూదన్ మహేష్, సుధాకర్, రాజేశ్వరి, ఉపాధ్యాయులు సమిష్టి సహకారం ఎంతో సంతోష కరమైన విషయమని పేరెంట్స్ కమిటీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె కనకాచారి అన్నారు. మీ కళాశాల బోధనా తీరు చూడ ముచ్చటగా వుందని, సహ ఉపాధ్యాయులు, సిబ్బంది సమిష్టి కృషితో ల్యాబ్ ఆకర్షణీయంగా, విజ్ఞాన వంతంగా తీర్చిదిద్దిన తీరు స్ఫూర్తి నిస్తోందన్నారు. సైన్స్, మోరల్ వేల్యూస్, జనరల్ నాలెడ్జ్ ప్రతిబింబించేలా ల్యాబ్ ఆర్టికల్ రూపొందించి, నిర్వహిస్తున్న తీరు అభినందనీయం' అని పేరెంట్స్ అంటున్నారని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి -సోమల: గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థినులకు ఇరికిపెంట సచివాలయ మహిళా పోలీ సుమమత ఆధ్వర్యం లో వడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళ వారం అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి రుచిగా వుందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు బాగా చదవాలని మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు రాలు పిఆర్ శ్రీదేవి, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): టెట్ పరీక్ష నుండి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 36 ను రద్దుచేసి ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేయాలని ఉపాధ్యాయ సంగం నాయకులు కోరారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో నెంబర్ 36 ద్వారా రాష్ట్రంలోని సుమారు లక్ష పదివేల మంది ఉపాధ్యాయులకు ఆందోళన కలిగించే రీతిలో ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. ఈ జీవోపై ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, దీన్ని ఉపసంహరించు కోవాలని, లేదంటే ఆందోళన చేపడుతామని సూచించారు. పిఆర్‌సి రాష్ట్ర కమిటీ కన్వీనర్ దేవరాజులు రెడ్డి, సంఘ నాయకులు చంద్రన్, జగదీశ్వర్ పిళ్ళై, సుబ్రహ్మణ్యం పిళ్ళై పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి-కుప్పం: గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితి తెలుసు కునేందుకు తప్పని సరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని ఐటిడిపి కుప్పం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. కుప్పం మండలం మటార్లపల్లిలో బుధవారం భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఒకసారి రక్త పరీక్ష చేసుకుంటే 49 రిపోర్టులు ఇస్తారని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.